క్లుప్తంగా

పరీక్షకు హాజరుకండి

తాడిపత్రి టౌన్‌: ఇంటర్మీడియట్‌ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులందరూ బుధవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు జరగనున్న ఎథిక్స్‌, ఎన్విరాన్‌మెంటల్‌ పరీక్షకు తప్పక హాజరుకావాలని తాడిపత్రి ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ విజయ్‌కుమార్‌ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరు కాని విద్యార్థుల పరీక్ష ఫలితాలను ప్రభుత్వం నిలుపుదల చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి పరీక్ష రాసి అర్హత సాధించాలని ఆయన కోరారు.

కేసు నమోదు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న మదీనా కేఫ్‌ వద్ద మూడు రోజుల క్రితం అప్పా సుభాష్‌ అనే యువకుడిపై గుత్తి ఎస్సీ కాలనీకి చెందిన కొందరు యువకులు దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో అప్పా సుభాష్‌పై దాడికి పాల్పడిన యశ్వంత్‌, భరత్‌, లచ్చి, గిరి, రాంబాబు, నరేష్‌, అనిల్‌, ఆర్యపై 324 సెక్షన్‌ కింద మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

బలిజ వెల్ఫేర్‌ సొసైటీ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక


ఎం.రమణ

గుత్తి: గుత్తి, గుత్తి మండల శ్రీకృష్ణదేవరాయ బలిజ వెల్ఫేర్‌ సొసైటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా పీవీ రమణ, అధ్యక్షుడిగా ఎం. రమణ, ఉపాధ్యక్షుడిగా శ్రీకరం గోవిందరాజులు, కార్యదర్శిగా రామనాయుడు, సంయుక్త కార్యదర్శిగా శ్రీకరం హరినాథ్‌, కోశాధికారిగా మంజునాథ్‌తో పాటు మరో 12 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16న పట్టణంలోని రాయల్‌ సర్కిల్‌ వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద రాయల జయంతిని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బలిజ కులస్తులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

20 నుంచి ఉచిత శిక్షణ

తాడిపత్రి టౌన్‌: స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఈనెల 20 నుంచి ఆంధ్రప్రదేశ్‌ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువతీ, యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్‌ విజయ్‌కుమార్‌, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆనంద్‌కుమార్‌, శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్‌ హరిప్రసాద్‌ తెలిపారు. టెన్త్‌, ఇంటర్‌, డిగ్రీ, పాలిటెక్నికల్‌, ఐటీఐ, ఇంజినీరింగ్‌ పాసు లేదా ఫెయిల్‌ అయిన యువతీ, యువకులకు మూడు నెలల పాటు శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9133004626 సంప్రదించాలని సూచించారు.

ఐఎఫ్‌టీయూ మహాసభల పోస్టర్ల విడుదల

గుంతకల్లుటౌన్‌: ఈ నెల 25, 26 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాని సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్‌ పిలుపునిచ్చారు. మంగళవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఐఎఫ్‌టీయూ డివిజన్‌ కమిటీ అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి జి.చిన్నా, నాయకులు రఘునాథరెడ్డి, జిలాన్‌, సత్తార్‌ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్‌ చేసుకోండి

బుక్కరాయసముద్రం: స్థానిక సొసైటీలో పంట రుణాలు తీసుకున్న రైతులు రెన్యూవల్‌ చేసుకోవాలని సొసైటీ చైర్మన్‌ గువ్వల పెద్ద వెంకటరెడ్డి, సీఈఓ ముస్తాఫా కోరారు. రుణగ్రహీతలు తప్పనిసరిగా ఈ- కేవైసీ చేయించు కోవాలని, లేని పక్షంలో ప్రభుత్వం అందించే రాయితీలు వర్తించవన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


కర్ణాటక మద్యాన్ని చూపుతున్న పోలీసులు

గుంతకల్లు: పట్టణంలో మంగళవారం కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్‌ సీఐ మహేష్‌కుమార్‌ తెలిపారు. తిలక్‌నగర్‌లోని రాయల్‌సర్కిల్‌లో టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తున్న బోయమాధవి అనే మహిళను అరెస్టు చేసి 768 (8 బాక్సులు) టెట్రా ప్యాకెట్లును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలపై వినతి

పామిడి: స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏపీటీఎఫ్‌ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యలపై డిప్యూటీ తహసీల్దార్‌ జీ లక్ష్మినారాయణరెడ్డికి అందజేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి వీ నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌ సిరాజుద్దీన్‌, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు బీవీ రమణ, రామచంద్ర, రామిరెడ్డి, రమణ, శ్యామ్‌రాజు, బాబు, మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు సతీష్‌, నూర్‌ మహమ్మద్‌ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు జేసీకి పరిపాటే

- ఇసుక అక్రమ రవాణాలో మీ వాటా ఎంత?
- వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల ధ్వజం


మాట్లాడుతున్న మండల ప్రజాప్రతినిధులు, నాయకులు

తాడిపత్రి: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, డీఎస్పీ వీఎన్‌కే చైతన్య, రెవెన్యూ అధికారులు, మైన్స్‌ అధికారులు, పోలీసులు... ఇలా నిత్యం ఎవరిని పడితే వారిపై, ఎప్పుడు పడితే అప్పుడు నిరాధారమైన ఆరోపణలు చేయడం జేసీ ప్రభాకర్‌రెడ్డికి పరిపాటుగా మారిందని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పెద్దపప్పూరు ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, వైస్‌ ఎంపీపీ రామయ్య, ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్‌ మెంబర్‌ వేమనాథరెడ్డి, మండల కన్వీనర్‌ అమర్నాథ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం పెద్దవడుగూరు మండలంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజా సంక్షేమ యాత్ర సమయంలో యాత్రకు వస్తున్న ఆదరణను చూసి మున్సిపల్‌ చైర్మన్‌ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఓర్వలేక అవాస్తవాలతో కరపత్రాలు పంపిణీ చేయించారన్నారు. అయితే ప్రజలు వాటిని పట్టించుకోకపోవడంతో తీవ్ర నిరాశకు గురైన ఆయన పెద్దపప్పూరు ఇసుక రీచ్‌ వద్ద ధర్నా చేపట్టారన్నారు. ప్రభుత్వం జేపీ సంస్థకు టెండర్‌ ద్వారా ఇసుక రీచ్‌లను కట్టబెట్టిందన్నారు. ఆ సంస్థ ఇసుక తవ్వకాలు చేపడుతుంటే ఇసుక తవ్వకం అక్రమం అని ఎలా చెబుతారని జేసీని ప్రశ్నించారు. పసలేని ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు.

నాడు రాయల్టీ చెల్లించి ఇసుక తోడుకున్నారా....

టీడీపీ హయాంలో పెన్నానది పరీవాహక ప్రాంతాల నుంచి నీవు నీ అనుయాయులు ఇసుకను యథేచ్ఛగా తవ్వుకుని కోట్లాది రుపాయలను దోచుకున్నారని, అప్పుడు ఎంత రాయల్టీ ఎవరికి చెల్లించారో చెప్పాలని నాయకులు డిమాండ్‌ చేశారు. ప్రస్తుతం ఇసుక రీచ్‌ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తోందన్నారు. కానీ జేసీ హయాంలో బెంగళూరుతోపాటు ఏపీలోని పలు ప్రాంతాలకు వేలాది ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తరలించి విక్రయించి సొమ్ము చేసుకున్నప్పుడు 'మేము ఇసుకను అమ్ముకుంటున్నాము. ఇంత సంపాదించుకుంటున్నాము' అని కరపత్రాల ద్వారా తాడిపత్రి ప్రజలకు తెలియజేసి ఉంటే బాగుండేదన్నారు. జేసీ దివాకర్‌ రెడ్డి అగ్రికల్చర్‌ కళాశాలకు ఇసుకను ఎక్కడి నుంచి కొనుగోలు చేశారో లేక ఎంత మేర రాయల్టీ చెల్లించారో ప్రజలకు తెలపాలన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా గోపాల్‌రెడ్డి ఇసుకను అక్రమంగా రవాణా చేసి విక్రయించుకుంటున్న సమయంలో ఎన్నో యాక్సిడెంట్లు జరిగాయని గుర్తు చేశారు. జేసీల హయాంలో ఎప్పుడైనా ముచ్చుకోట రిజర్వాయర్‌, చాగల్లు డ్యాం, పెండేకల్లు రిజర్వాయర్లలో ఒక్క చుక్క నీరు నింపిన పాపాన పోలేదన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వాటిలో నీరు నింపి రైతులందరి చేత శభాష్‌ అనిపించుకుంటున్నారన్నారు. ఆయనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక తిక్క చేష్టలు చేస్తున్నారన్నారు. ప్రజలకు మేలు జరిగే పనులపై పోరాటాలు చేయాలని అనవసరంగా అందరిపై అభాండాలు వేయడం సరికాదని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని వారు జేసీ ప్రభాకర్‌రెడ్డికి హితవు పలికారు.

బాట సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్‌

గుత్తి రూరల్‌: బాచుపల్లి గ్రామంలో వెలసిన బాట సుంకులమ్మ ఆలయంలో మంగళవారం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే, కబడ్డీ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డిని పార్టీ నాయకులు, కార్యకర్తలు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. గజమాలతో వారిని సత్కరించారు. అనంతరం అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేకి అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు. అమ్మవారిపై ఉంచిన వస్త్రాలను అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, హరి జిరాక్స్‌ సుబ్బారెడ్డి, గోవిందు నాయక్‌, జయరామిరెడ్డి, సోమిరెడ్డి, తిక్కస్వామి, మొలకలపెంట జగన్‌ పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం


కరపత్రాలను పంపిణీ చేస్తున్న సాయికృష్ణ

తాడిపత్రి టౌన్‌: కుల,మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించడంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషి ప్రజలకు తెలియచేయడానికి అనంతపురం జిల్లా రాప్తాడు నుంచి తాడేపల్లి వరకు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలెమ్మగారి సాయికృష్ణ చేపట్టిన పాదయాత్ర మంగళవారం తాడిపత్రికి చేరింది. పట్టణంలోని సీబీరోడ్డు, ప్రధాన వీధుల్లో మన రాష్ట్రానికి జగనన్న ముద్దు.. చంద్రబాబు వద్దే వద్దు కరపత్రాలను ప్రజలకు ఆయన పంపిణీ చేశారు. సీఎం జగన్‌ చేపట్టుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది


అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న తిమ్మప్ప

గుంతకల్లు రూరల్‌: దేశం కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగం మరువలేనిదని శంకరానందగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ పీ గోపాల్‌ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో అమరవీరులకు ఘన నివాళులర్పించారు. పుల్వామా ఉగ్రదాడి ఘటనలో ప్రాణాలను కోల్పోయిన వీర జవాన్లను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్‌ కేసీ హరి, ఎన్‌సీసీ ఆఫీసర్‌ ప్రకాష్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాడికి: పుల్వామా ఘటనలో అమరులైన సైనికులకు స్థానిక విజన్‌, వికాష్‌ ప్రైవేటు పాఠశాలలో ఏఎస్‌ఐ రామాంజనేయులు, సిబ్బంది, కరస్పాండెంట్‌లు విశ్వనాథ, రామకృష్ణ విద్యార్థులతో కలిసి మంగళవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. పాఠశాలలో 40 చెట్లను విద్యార్థుల చేత నాటించి వాటిని సంరక్షించాలని సూచించారు.

గుంతకల్లుటౌన్‌: పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన వీర జవాన్ల త్యాగం ఎన్నటికీ మరువలేనిదని కాన్ఫడరేషన్‌ ఆఫ్‌ ఎక్స్‌ పారామిలటరీ ఫోర్సెస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ జిల్లా వైస్‌ చైర్మన్‌ ఎం.తిమ్మప్ప, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మంజుల వెంకటేష్‌ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రిన్సిపల్‌ సాలాబాయి, పారామిలటరీ అసోసియేషన్‌ సభ్యులు సత్తార్‌సాహెబ్‌, రామకృష్ణ, సుధాకర్‌, గోవిందప్ప, రవీంద్రనాయుడు, ఖాదర్‌వలి, బీజేవైఎం నాయకులు కేశవ, రవి, చక్రీ, లెక్చరర్లు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి


పాతకొత్తచెరువు జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను కలిసిన నాయకులు

గుంతకల్లు రూరల్‌: వైఎస్సార్‌సీపీ తరపున పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి ఓటర్లకు విన్నవించారు. సమితి సభ్యులతో కలిసి మంగళవారం పాతకొత్తచెరువు గ్రామంలో పర్యటించిన రాజశేఖరరెడ్డి గ్రామంలోని పట్టభద్రులను, పాఠశాలలోని ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. రాయలసీమ అభివృద్ధి చెందాలన్నా, కర్నూలులో న్యాయ రాజధాని రావాలన్నా వైఎస్సార్‌సీపీ అభ్యర్థినే గెలిపించుకోవాలన్నారు. సమితి నాయకులు జ్ఞానేశ్వర్‌ రెడ్డి, కాశీరావు, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గార్లదిన్నె: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌ సీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రం జిల్లా పరిషత్‌ హైస్కూలు, మోడల్‌, కస్తూర్బా పాఠశాల, బ్యాంకులు, పోలీస్‌స్టేషన్‌లో వారు ప్రచారం నిర్వహించారు. వెన్నపూస రవీంద్రరెడ్డి సోదరుడు రామిరెడ్డి, నాయకులు ధనుంజయ రెడ్డి, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నకు రుణపడి ఉందాం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రామలింగప్ప

గుంతకల్లుటౌన్‌: రాష్ట్రంలోని దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల పాలకవర్గాల్లో ఓ ధర్మకర్తగా నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించిన ఏపీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి ఆ కులస్తులంతా రుణపడి ఉందామని వైఎస్సార్‌సీపీ బీసీసెల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మున్సిపల్‌ చైర్మన్‌ ఎన్‌.రామలింగప్ప పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మోదినాబాద్‌ నాయీబ్రాహ్మణ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం చిత్రపటానికి రామలింగప్పతోపాటు నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్‌ను కట్‌ చేసి స్వీట్లు పంచిపెట్టారు. సంఘం పట్టణాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి వేణుగోపాల్‌, నాయకులు మాణిక్యం, ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌ పరుశురామ్‌, ప్రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండు లీజుపై వ్యాపారులకు అవగాహన


మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్‌ ఆర్‌.ఆదోని

గుత్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు స్థలాన్ని 33 ఏళ్లపాటు లీజుకిచ్చే విషయంపై మంగళవారం గుత్తి డిపోలో వ్యాపారస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌ఎం సుమంత్‌ ఆర్‌. ఆదోని, డీఈఈ సురేంద్ర బాబు మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు బస్టాండ్‌ స్థలం మొత్తం 2.99 ఎకరాలు 33 ఏళ్లపాటు లీజుకు ఇస్తామన్నారు. లీజుదారులు ఆర్టీసీ, ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో గుత్తి, తాడిపత్రి బస్టాండ్‌లను లీజుకు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు విజయభాస్కర్‌, రాజశేఖర్‌రెడ్డి, మాకం శ్రీకాంత్‌ తదితరులు పలు సందేహాలను ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాటిని ఆర్టీసీ ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఆర్‌ఎం తెలియజేశారు.

తాడిపత్రి టౌన్‌ : స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్‌ ఆర్‌.ఆదోని అధ్యక్షతన వ్యాపారులతో ఆర్టీసీ బస్టాండ్‌ స్థలం లీజుపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఆర్‌ఎం మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్‌ స్థలాలను వాణిజ్య సముదాయాలకు లీజ్‌కిచ్చి పబ్లిక్‌, ప్రయివేటు భాగస్వామ్యంతో ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునిక విధానంలో నిర్మించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆర్టీసీ ఇంజినీర్‌ సురేంద్రనాథ్‌, డీఎం శంకర్‌, ఆర్టీసీ సీఐ నందిని, బస్టాండ్‌ మేనేజర్‌ పుల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా సాంబశివారెడ్డి జన్మదిన వేడుకలు


బీకేఎస్‌లో కేక్‌ కట్‌ చేస్తున్న నాయకులు

బుక్కరాయసముద్రం: స్థానిక సొసైటీ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్‌ కట్‌ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి నియోజక అభివృద్ధికి రెండు కళ్లలాంటి వారని కొనియాడారు. జెడ్పీటీసీ భాస్కర్‌, సొసైటీ అధ్యక్షుడు గువ్వల వెంకటరెడ్డి, సర్పంచ్‌ పార్వతి, మండల కన్వీనర్‌ అంకే నరేష్‌, నాయకులు గువ్వల రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పూల నారాయణస్వామి, కొండమ్మ, చికెన్‌ నారాయణస్వామి, ముత్యాల శీన, చేపల రమణ, బయపరెడ్డి, సాకే లక్ష్మీనారాయణ, శ్రీనివాసరెడ్డి, కాటమయ్య, జయరామిరెడ్డి, ముత్యాల రంగా, చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

బీసీ హాస్టల్లో వాటర్‌ ప్లాంట్‌ ప్రారంభం


వాటర్‌ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కుష్బూ కొఠారి

గుత్తి: స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల హాస్టల్లో ఆర్‌ఓ వాటర్‌ ప్లాంట్‌ ప్రారంభమైంది. సాహితీ గగన్‌ మహల్‌ సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది జె. ప్రతాప్‌రెడ్డి చొరవతో కార్పొరేట్‌ సోషల్‌ రెస్పాన్సిబిలిటీ కింద సెంట్రల్‌ బ్యాంక్‌, సెంట్‌ బ్యాంక్‌ హోమ్‌ లోన్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌ నిధులతో ఆర్‌ఓ వాటర్‌ ప్లాంట్‌ ఏర్పాటు చేశారు. ప్లాంట్‌ను మంగళవారం ప్రతాప్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్‌ డిప్యూటీ డైరెక్టర్‌ కుష్బూ కొఠారి రిబ్బన్‌ కత్తిరించి ప్రారంభించారు. వార్డెన్‌ పుష్పలత, అసిస్టెంట్‌ బీసీ వెల్ఫేర్‌ ఆఫీసర్‌ రంగమ్మ, బీసీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ మారుతి ప్రసాద్‌, వార్డెన్లు సుజాత, ఖాదర్‌ హుస్సేన్‌ తదితరులు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో సెంట్రల్‌ బ్యాంక్‌, స్టేట్‌బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా సౌజన్యంతో ఏర్పాటు చేసి ఆర్వో ప్లాంట్‌ను న్యాయవాది ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ సుభద్రమ్మ మంగళవారం ప్రారంభించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

పోటాపోటీగా రాతిదూలం లాగుడు పోటీలు


రాతిదూలం లాగుతున్న వృషభాలు

గుంతకల్లు రూరల్‌: వెంకటాంపల్లిలో పెద్ద కదిరప్ప స్వామి రథోత్సవంలో భాగంగా మంగళవారం దేశవ ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు పోటాపోటీగా సాగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 21 జతల పాల్గొన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో వజ్రకరూరు మండలం చాబాలకు చెందిన రైతు చిన్న కుళ్లాయప్ప ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ. 20 వేల ప్రైజ్‌ మనీని గెలుచుకున్నాయి. విడపనకల్లు మండలం గడేకల్లుకు చెందిన రైతు వేణుగోపాల్‌ వృద్దులు ద్వితీయ, బొమ్మనహాళ్‌ మండలం, లింగదహాళ్‌కు చెందిన రైతు ఎర్రిస్వామి వృషభాలు తృతీయ, నెలగొండ గ్రామానికి చెందిన రైతు వెంకట్రాముడు ఎద్దులు నాల్గవ స్థానం, కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం, యర్రగుంటపల్లికి చెందిన రైతు అనిల్‌ ఎద్దులు ఐదో స్థానం, దంచర్ల రైతు కొట్టం రామాంజనేయులు ఎద్దులు ఆరవ స్థానంలోనూ నిలిచి వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు గెలుచుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే కొట్రికే మధుసూదన గుప్త ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు.

విద్యుత్‌ బకాయిలు వెంటనే చెల్లించండి

గార్లదిన్నె: మండలంంలోని వ్యవసాయ విద్యుత్‌ వినియోగదారులు బకాయిలు వెంటనే చెల్లించాలని ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాసరెడ్డి కోరారు.మంగళ వారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో 5,225 వ్యవసాయ విద్యుత్‌ కనెక్షన్లు ఉన్నాయన్నారు. దాదాపు రూ.59 లక్షలు విద్యుత్‌ బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిలు ఉన్న వినియోగదారులు వెంటనే విద్యుత్‌ బిల్లులు చెల్లించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలన్నారు. బిల్లులు చెల్లించని వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈ శివప్రసాద్‌ ,సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

గుంతకల్లు రూరల్‌: గుంతకల్లు- గుత్తి జాతీయ రహదారిపై గొల్లల దొడ్డి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..గుండాల తండా గ్రామానికి చెందిన వెంకటేష్‌ నాయక్‌, ఆదినాయక్‌, బాబు నాయక్‌ సేవాలాల్‌ ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాత్రి బైక్‌పై బయలుదేరారు. గొల్లలదొడ్డి వద్ద సేవాలాల్‌ ఆలయం వైపు క్రాస్‌ తిరుగుతుండగా గుత్తి వైపు నుంచి వేగంగా వచ్చిన వాహనం ఢీకొనింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురినీ గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

20న మండల మీట్‌

పుట్లూరు: మండల పరిషత్‌ కార్యాలయంలో ఈ నెల 20న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

భక్తి మార్గంలో నడవాలి

నార్పల: ప్రజలంతా భక్తి, సేవా మార్గాలలో నడవాలని బ్రహ్మేంద్రస్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అయప్పస్వామి ఆలయంలో భాగవత సప్తాహ పఠణం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. పెద్దలు తీగల నారాయణరెడ్డి, బయన్న, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

గార్లదిన్నె: మండలంలో మంగళవారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. 108 సిబ్బంది వివరాల మేరకు.. కెకెతండాకు చెందిన లక్ష్మి భాయ్‌ తన భర్తతో కలసి ఆటోలో వెళ్తుండగా కేశవాపురం సమీపంలోకి ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడడంతో లక్ష్మీబాయికి తీవ్రగాయాలయ్యాయి. ఇక 44వ జాతీయ రహదారిపై రామ్‌దాస్‌పేట వద్ద శిరివరం గ్రామానికి చెందిన మధు బైక్‌పై రోడ్డు దాటుతుండగా డోన్‌కు చెందిన హరినాథ్‌ బైక్‌తో ఢీకొన్నాడు. ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అశ్వత్థంలో హుండీ కానుకల లెక్కింపు


కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: అశ్వత్థంలో మంగళవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ లక్ష్మీనారాయణ, ఆలయ చైర్మన్‌ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యంల నేతృత్వంలో హుండీ కానుకలను లెక్కించారు. తాత్కాలికి హుండీల ద్వారా రూ.6.84 లక్షలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆలయ కమిటిసభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

శారీరక వ్యాయామం ఎంతో అవసరం


ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు చదువులతో పాటు శారీరక వ్యాయామం ఎంతో అవసరమని బీకేఎస్‌ సీహెచ్‌ఓ ఆనందరావు, కొర్రపాడు హెల్త్‌ ఎడ్యుకేటర్‌ పర్వీన్‌ పేర్కొన్నారు. మంగళవారం బీకేఎస్‌, కొర్రపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సైకిల్‌ తొక్కండి-ఆరోగ్యాన్ని కాపాడండి అనే కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. బీకేఎస్‌ జెడ్పీ హైస్కూల్‌ హెచ్‌ఎం సుమంగళి, లక్ష్మీదేవి, వసుంధర, పీహెచ్‌ఎన్‌ చెన్నమ్మ, సూపర్‌వైజర్‌ ఈశ్వరమ్మ, హెల్త్‌ అసిస్టెంట్‌ ధనుంజయ, శివానంద, ఆనంద్‌, పీడీ గోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


హనుమంతరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పామిడి వీరా

పామిడి: మండలంలోని జీ కొట్టాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత హనుమంతరెడ్డి(60) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్‌ ఎం వీరాంజనేయులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. హనుమంతరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. నాయకులు, ఎర్రపరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రసూల్‌, నాగేశ్వర్‌ రెడ్డి, సోము, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.